క్లుప్తంగా

అంధకారంలో హెల్త్ సిటీ



చీకటిలో ఉన్న హెల్త్ సిటీ

ఆరిలోవ: కార్పొరేట్ ఆస్పత్రులకు నిలయమైన హెల్త్ సిటీలో అంధకారం నెలకొంది. నెలలు తరబడి ఇక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఇక్కడ ఆస్పత్రులకు వెళ్తున్న రోగులు, వారి బంధువులు రాత్రి వేళ నానా అవస్థలు పడుతున్నారు. హెల్త్‌సిటీ ప్రాంగణంలో పినాకిల్, క్యూ1, ఎంబీ, శుశ్రత ఈఎన్‌టీ, రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రి తదితర 16 ఆస్పత్రులతో పాటు విజయా మెడికల్ సెంటర్ సేవలు అందిస్తున్నాయి. ఆయా ఆస్పత్రులకు రోజూ వందలాది మంది రోగులు, వారి బంధువులు వెళ్తుంటారు. వీరిలో కొందరు రాత్రి వరకు వైద్యం కోసం ఆస్పత్రుల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ నుంచి బయలుదేరి బయటకు వచ్చేసరికి రోడ్లన్నీ చీకటిమయమవుతున్నాయి. కొద్ది నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఇక్కడ హెల్త్‌సిటీ అసోసియేషన్, విద్యుత్ విభాగం అధికారులు పట్టించుకోకపోవం గమనార్హం. ఇప్పటికైనా అసోసియేషన్ పెద్దలు, విద్యుత్ విభాగం అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'కేంద్రంపై నిందలు మానుకోవాలి'



మాట్లాడుతున్న మాధవ్

ఎంవీపీ కాలనీ: అవగాహన రాహిత్యంతోనే మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ ఆరోపించారు. సోమవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆగ్రహానికి గురైన ప్రతి అంశాన్ని రాష్ట్ర మంత్రులు కేంద్రంపై నెట్టేస్తున్నారన్నారు. ఇటీవల రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుం, నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ స్తంభించడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రజాప్రతినిధులు కేంద్రంపై నిందలు మోపారన్నారు. బ్లూ ఫ్లాగ్ పేరిట దేశంలోని 12 బీచ్‌లను కేంద్ర ప్రభుత్వం సొంతంగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, సురేంద్రమోహన్, ధనేష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం మేలు



వైద్య శిబిరంలో దివ్యాంగురాలిని పరిశీలిస్తున్న సామ్యానంద్ అవదూత

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పలు ఆరోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి ఆచార్య సామ్యానంద్ అవదూత, ఆచార్య రామేశ్వర అవదూత ఆయుర్వేద వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ ఆయుర్వేదం చాలా మేలైన వైద్యమన్నారు. ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని చెప్పారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సమితి ఎంవీపీ కాలనీ సెంటర్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార ఉత్పత్తులను పంపిణీ చేశారు. నగరంలోని పలు చోట్ల ఈ కార్యక్రమం జరిగింది. దాదాపు 30 మంది గర్భిణులకు ఈ కిట్లు పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. అలాగే 82 మంది నిరాశ్రయులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

సకల సేవలూ.. ప్రజల చెంతకే

- 'జగనన్న సురక్ష'లో అక్కరమాని విజయనిర్మల
- పలువురు లబ్ధిదారులకు ధ్రువ పత్రాల అందజేత



17వ వార్డులో లబ్ధిదారుడికి ధ్రువపత్రం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల



9వ వార్డులో ధ్రువ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సకల సేవలను ప్రజల చెంతకు చేర్చారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం 17వ వార్డులోని నేతాజీ పార్కులో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థల ద్వారా ఇప్పటికే పరిపాలన సౌలభ్యాన్ని ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఇప్పుడు సురక్ష శిబిరాల నిర్వహణతో కొత్త ఒరవడికి నాంది పలికారన్నారు. ఈ క్యాంపుల ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సర్టిఫికెట్లు నిమిషాల వ్యవధిలో అందిస్తూ చరిత్ర సృష్టించారన్నారు. ముఖ్యమంత్రి మంచి ఉద్దేశంతో అందుబాటులోకి తెచ్చిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ గేదెల లావణ్య మాట్లాడుతూ క్యాంపుల ద్వారా సులభతరంగా సర్టిఫికెట్లు పొందడంతో పాటు అర్హతలకు అనుగుణంగా ప్రతి ప్రభుత్వ పథకాన్ని పొందాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు అక్కరమాని పలు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శిరీషా, పలువురు జీవీఎంసీ అధికారులు, పార్టీ నాయకులు నీలారెడ్డి, లక్ష్మణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీఎం జగన్ లక్ష్యం

బీచ్ రోడ్డు: ప్రజా సమస్యలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. సోమవారం జీవీఎంసీ 9వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారన్నారు. నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగితే గానీ ఫలితం ఉండేది కాదన్నారు. ఈ సమస్య సచివాలయం వ్యవస్థ ద్వారా కొంత తగ్గినా.. ఇంకా ప్రజలకు త్వరితగతిన అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ధ్రువ పత్రాల జారీలో జాప్యం జరగడంతో ప్రభుత్వ పథకాలు, విద్యార్థుల చదువులు సకాలంలో పొందలేకపోతున్నారని సీఎం వైఎస్ జగన్ గుర్తించి, సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తుండడంతో ఓర్వలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్ తప్పుడు కూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ప్రతిపక్షాలు చూడలేక మతి భ్రమించి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్పొరేటర్ ఉమ్మడి స్వాతి దాస్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రజలు కొనియాడుతుంటే ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు.

710 మందికి ధ్రువ పత్రాల పంపిణీ

జీవీఎంసీ 9వ వార్డులోని 5 సచివాలయాల పరిధిలో 6,325 ఇళ్లు ఉండగా.. వారిలో సురక్ష కార్యక్రమం ద్వారా 723 మంది నుంచి వలంటీర్లు వివిధ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు సేకరించారు. వాటిలో 710 మందికి సోమవారం ధ్రువ పత్రాలు అందజేశారు. వీటిలో 620 కుల, 83 ఆదాయ, ఒకటి కొత్త రైస్ కార్డు, ఆరు రైస్ కార్డు విభజన పత్రాలు ఉన్నాయి.

సమయం, డబ్బు ఆదా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటికే అన్ని పథకాలు అందేలా చేస్తున్నారు. గతంలో పింఛన్‌కు అవసరమైన కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అందుకు చాలా డబ్బు కూడా ఖర్చు అయ్యేది. కానీ ఇప్పుడు మా ఇంటికే వలంటీర్లు వచ్చి మరి దరఖాస్తులు తీసుకున్నారు. ఉచితంగా ధ్రువ పత్రాలు అందజేశారు. సమయంతో పాటు డబ్బులు కూడా చాలా ఆదా అయ్యాయి.

– సత్యవతి, 9వ వార్డు

ధ్రువ పత్రాల కోసం తప్పిన పాట్లు



గతంలో కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం నానా పాట్లు పడేవాళ్లం. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన చాలా రోజుల తరువాత పత్రాలు పొందేవాళ్లం. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు ఇంటికి వచ్చి సర్వే చేసి ఎవరికి ఏ ధ్రువ పత్రం కావాలో అడిగి మరీ దరఖాస్తు చేశారు. ఆ పత్రాలు ఇప్పుడు ఉచితంగా ఇచ్చారు. ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.

– ఎర్ర లక్ష్మి, 9వ వార్డు

ఏయూ సమాచారం

జీఎస్‌టీపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: సేవల పన్ను(జీఎస్‌టీ)పై రచించిన ద్విభాషా పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు ఎడిటర్‌గా, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకులు డాక్టర్ గుడిపాటి శ్రీనివాసరావు, డాక్టర్ జి.అరుణ్‌కుమార్, డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శ్యాంబాబు, హెచ్.ఎస్.ఎన్.వి.ఎస్.పవన్‌కుమార్ సహ రచయితలుగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో ఆంగ్లం, తెలుగు భాషల్లో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు రచయితలు తెలిపారు. సులభంగా వస్తు, సేవల పన్నులకు సంబంధించిన పాఠ్యాంశాలను దీనిలో పొందుపరిచామన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖలో పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మేయర్ డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు. ప్రతీ సోమవారం జీవీఎంసీ ఉద్యోగులు ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు.

యోగాతో శరీరం, మనస్సుల అనుసంధానం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: మానవ శరీరం, మనస్సులను అనుసంధానం చేసేదిగా యోగా నిలుస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ యోగా విలేజ్‌లో జరుగుతున్న ‘అనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్’ రెండు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. యోగాచార్య డాక్టర్ రాపర్తి రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భారతీయ మూలాలు కలిగిన యోగా నేడు విశ్వవ్యాప్తంగా విస్తరించిందన్నారు. సాత్విక లక్షణాలను పెంపొదించే ఆహారాన్ని స్వీకరించడం ఎంతో ప్రధానమన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ ఆచార్య పి.రవీంద్రనాథ్, ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరావు, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, డాక్టర్ ఆర్.తులసిరావు, డి.వెంకటరావు, డి.సాయి కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి, డాక్టర్ సి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ సంక్లిష్టమైన ప్రక్రియ

- ఓటు హక్కు వినియోగించుకునే దిశగా చైతన్యం అవసరం
- ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య మూర్తి



ప్రసంగిస్తున్న ఆచార్య డి.వి.ఆర్.మూర్తి

ఏయూ క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ రాజనీతిశాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా భారతదేశంలో ఎన్నికల నిర్వహణ అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఓటు హక్కును పూర్తిస్థాయిలో అందరూ వినియోగించుకునే దిశగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1971లో దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన సందర్భంలో 17 కోట్ల మందికి ఓటు హక్కు ఉండేదని, నేడు 90 కోట్ల మందికిపైగా ప్రజలకు ఓటు హక్కు ఉందన్నారు. అయితే ఎన్నికల్లో 70 శాతం మంది వరకు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. దేశంలో ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రభుత్వం ఒక్కో ఓటుకు సగటున రూ.72 ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. 1951లో ఒక్కో ఓటుకు 60 పైసలు ఖర్చు అయ్యేదని తెలిపారు. 1957లో బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, ఓటు వేసినందుకు గుర్తుగా సిరా గుర్తు వేయడం, ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర అంశాలను వివరించారు. ఎన్నికల సంఘానికి ఎన్నికల సమయంలో ఎదురవుతున్న వివిధ సవాళ్లపై అవగాహన కల్పించారు. భారత్‌లో ఈవీఎంల వినియోగం, వీటిపై న్యాయస్థానాలలో వ్యాజ్యాలు వేయడం తదితర అంశాలను తెలియజేశారు. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్ అనేది పెద్ద సవాలుగా మారుతోందన్నారు. 2009లో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.350 కోట్ల వరకు పెయిడ్ న్యూస్ రూపంలో ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు.

ఐఐపీఏ విశాఖ ప్రాంతీయ శాఖ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు దాదాపు రూ.65 వేల కోట్లు ఖర్చు అవుతుందని, ఇది ఒక రాష్ట్ర ఏడాది బడ్జెట్‌తో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఏ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్.సాంబశివరావు, కార్యదర్శి పి.ప్రేమానందం, పూర్వ చైర్మన్ ఆచార్య ఇ.ఎ.నారాయణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సవిత, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం



ఎంవీపీలో చెత్తతో నిండిపోయిన డస్ట్ బిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఎంవీపీ కాలనీ: చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 18వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఆయన జోన్–3 పరిధిలోని ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు, సమతా కళాశాల కూడలి ప్రాంతాల్లో పర్యటించారు. సమతా కళాశాల కూడలిలో ఒక డస్ట్ బిన్ పూర్తిగా చెత్తతో నిండి పోవడాన్ని కమిషనర్ గమనించారు. దీంతో రోజు ఉదయం పూట చెత్త తరలింపునకు వాహనాలు వస్తున్నా తరలింపులో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పనితీరు మెరుగుపరచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తక్షణమే చెత్తను తరలించి వాట్సప్‌లో పోటోలు పెట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా జరగడం లేదంటూ కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. చెత్త తరలింపు విషయంలో సిబ్బంది చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలువలను శుద్ధి చేయాలని, దోమల మందులు పిచికారీ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, జ్వరాల పై ఇంటింటి సర్వే విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా విశాఖ కమిటీ నాయకులు

సీతమ్మధార: విశాఖలో బాలికపై అత్యాచార ఘటనను ఖండిస్తూ, మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని 104 ఏరియా బాపూజీనగర్‌లో స్థానిక బాలికపై అతిదారుణంగా స్కూల్ అటెండర్, మరో నలుగురు కలిసి లైంగికదాడికి పాల్పడటం బాధాకరమన్నారు. విశాఖలో ఇటువంటి దారుణాలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు ‘బేటీ బచావో.. బేటీ పడావో’ అనే నినాదంతో ప్రధాని ప్రచారం చేస్తున్నారని, మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం దిశా చట్టాన్ని తీసుకొచ్చిందని.. ఆచరణలో మాత్రం మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి మానవ మృగాలను సమాజంలో తలెత్తుకోకుండా కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.విమల, మమత, నిర్మల, కె.కుమారి, హేమలత, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు

- ఇసుకతోట జంక్షన్ వద్ద ఆందోళన
- పవన్ కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు



పవన్ పోస్టర్‌ను కాలితో తన్నుతున్న వలంటీర్లు



జాతీయ రహదారిపై రాసారోకో చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దిలపాలెం: జనసేన పార్టీ నేత పవన్ కల్యాణ్ మతి భ్రమించి సేవాతత్పరులపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మండిపడ్డారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించిన వలంటీర్లపై ఆరోపణలు చేయడానికి సిగ్గు లేదా? అని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం పవన్ కల్యాణ్ వలంటీర్లపై ఏలూరులో ఆరోపణలు చేయడాన్ని నిరసిస్తూ విశాఖలో వలంటీర్లు ఆందోళనకు దిగారు. పవన్ ఫ్లెక్సీలను చెప్పులతో కొడుతూ సోమవారం ఇసుకతోట జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. పవన్ కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆయన దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవలందిస్తున్న విద్యావంతులైన వలంటీర్లపై ఆరోపణలు చేయడానికి పవన్‌కల్యాణ్‌కు నోరు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. వృద్ధులకు ఒకటో తేదీన వేకువజామునే ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారని, సంక్షేమ పథకాలు అమలులో, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా పనిచేస్తున్న వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలోనే వలంటీర్ల వ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటున్నారని, పిచ్చి ప్రేలాపనలు పవన్ కల్యాణ్ మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పవన్‌వి దిగజారుడు రాజకీయాలు

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై నిరాధారమైన ఆరోపణలు చేసి పవన్ కల్యాణ్ దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు పథకాల పేరిట దండుకుని పేదల పొట్టలు కొట్టేవారన్నారు. ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థతో అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తుండడాన్ని చూసి తట్టుకోలేక నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో మహిళా తహసీల్దార్ వనజాక్షిపై ఎమ్మెల్యే దాడిచేస్తే అప్పుడు పవన్ కల్యాణ్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. నీచ, నికృష్టమైన రాజకీయ ఎత్తుగడలను ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు గేదెల లావణ్య, అప్పారి శ్రీవిద్య, మువ్వల లక్ష్మి, ఉమ్మడి స్వాతి దాస్, అక్కరమాని రోహిణి, పార్టీ వార్డు ఇన్‌చార్జిలు పల్లా దుర్గారావు, పీతల గోవింద్, అప్పారి గిరిబాబు, పుక్కెళ్ల ధనలక్ష్మి, శంకర్, సూరాడ వెంకటలక్ష్మి, జగ్గుపల్లి అప్పలరాజు, ప్రసాదుల భాగ్యానంద్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి



ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే వలంటీర్లపై రాజకీయాలు చేయడం పవన్ కల్యాణ్‌కు తగదు. తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేకపోతే వలంటీర్లు ఏకమై తడఖా చూపిస్తాం. – అనురాధ, వలంటీర్, కేఆర్ఎం కాలనీ, 16వ వార్డు

మతి భ్రమించింది



పవన్ కల్యాణ్‌కు మతి భ్రమించింది. క్షేత్రస్థాయిలో వలంటీర్లు చేస్తున్న సేవలు ఏసీ గదిలో ఉండే యాక్టర్‌కు ఎలా తెలుస్తుంది. అందుకే పిచ్చి వాగుడు వాగుతున్నారు. నేల మీద నడిచి ఇంటింటికీ వెళ్లి అడిగితే తెలుస్తుంది వలంటీర్లు అంటే ఎంటో.

– అనుషా, వలంటీర్, భానునగర్

ఆరోగ్య కేంద్రాల్లో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు

- వైద్యులు ప్రణాళికలు సిద్ధం చేసుకోండి
- జనాభా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ మల్లికార్జున



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, రాజేష్

మహారాణిపేట: ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ప్లానింగ్ శస్త్రచికిత్సలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేయాలని, దీనికి సంబంధించి వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా తేదీలను ఖరారు చేసి ఆపరేషన్లు నిర్వహించాలని చెప్పారు. మధురవాడ, గాజువాక, రేవటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కోసం ప్రణాళికలు వేసుకొని ప్రారంభించాలన్నారు. నగరంలోని కేజీహెచ్, వీజీహెచ్‌ల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని, వాటి కన్నా ఎక్కువగా జరగాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ శాశ్వత పద్ధతుల్లో ట్యూబెక్టమీలు 2022–23 సంవత్సరానికి గాను 4,729, వ్యాసెక్టమీలు 44 చేసినట్టు వివరించారు. ఈ నెల 11వ తేదీ మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రాజేష్, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.